మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి మాధవీలత

రైతులకు తక్కువ వడ్డీ రుణాలు అందించాలి : మాధవీలత

భువనగిరి అర్బన్, మార్చి 12 : రైతులకు తక్కువ వడ్డీ రుణాలు అందించాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వి.మాధవీలత అన్నారు. పట్టణంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె హాజరై మాట్లాడారు. బ్యాంకులు అందించే రుణాలతో రైతులు ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్స హించాలన్నారు.

బ్యాంక్, వ్యవసాయ శాఖ అధికారులు రుణాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులను గుర్తించాలి : ఎంపీడీఓ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), మార్చి 12 : మండలంలోని అన్ని గ్రామాల్లో ముందస్తుగా ఉపాధి పనులను గుర్తించి జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను పెంచాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీఓ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఓ బొడిగె రమేశ్‌గౌడ్, టీఏలు యాదిరెడ్డి, శ్రీశైలం, మల్లేశం, పంచాయతీ కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్ లేకుండా చేసేది మాదిగలే : రామకృష్ణ

నిరసన దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 12 : ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డిని రాజకీయ భవిష్యత్ లేకుండా చేసేది మాదిగలేనని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ అన్నారు. వర్గీకరణ కాకుండా నియామకాలు చేపడుతున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ పట్టణంలో చేపట్టిన నిరసన దీక్ష బుధవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాట మీద నిలబడడం లేదని విమర్శించారు. ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించి ఇచ్చిన నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణ అమలు చేసి మాదిగలకు న్యాయం చేస్తామని చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దీక్షకు ఎంఎస్ఎఫ్ నాయకులు బోయ మల్లేశ్, కుక్క స్వామి, పోతగాళ్ల దానయ్య, కునుకుంట్ల రమేశ్, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల కరుణాకర్, బండారు శివశంకర్, పాముకుంట్ల బసవయ్య, శ్రీనివాస్, మనోజ్ కుమార్, మహేశ్, రాములు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి : డాక్టర్ దివ్య

విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆత్మకూరు(ఎం), మార్చి 12 : విద్యార్థినులు ప్రతి రోజూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని పల్లెదవాఖాన వైద్యురాలు దివ్య అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం ఆమె వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అపరిశుభ్రత వల్లే అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని రోజు ఉదయం, సాయంత్రం చేతులు, ముఖం, సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వాణి, మరియమ్మ, కృష్ణవేణి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించాలి : ఏబీవీపీ

మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జూపల్లి దీపిక

భువనగిరి అర్బన్, మార్చి 12 : రాష్ట్ర ప్రభు త్వ బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జూపల్లి దీపిక అన్నారు. పట్టణంలోని ఏ హోటల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని భర్తీ చేయాలని, విశ్వవిద్యాలయాలకు బడ్జెట్ మేరకు బ్లాక్ గ్రాంట్ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు అరవింద్, సాయికిరణ్, మధు పాల్గొన్నారు.

అంధకారంలో భీమనపల్లి

భీమనపల్లి గ్రామంలో వీధిలైట్లు వెలుగకపోవడంతో చీకట్లోనే వీధులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 12 : మండలంలోని భీమనపల్లి గ్రామంలో లైట్లు లేక వీధులన్నీ అంధకారంలో మగ్గుతున్నాయి. గత మూడు నెలల నుంచి వీధిలైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోచంపల్లి నుంచి మండలంలోని పరిసర గ్రామాలు చౌటుప్పల్‌కు వెళ్లేందుకు ఇదే రహదారి నుంచి వాహనాలు వెళ్తుంటాయి. వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువ ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

యువ ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ నవీన్ కుమార్

ఆలేరు టౌన్, మార్చి 12 : జిల్లా స్థాయిలో నిర్వహించే యువ ఉత్సవ్ పోస్టర్‌ను ఆలేరు పట్టణంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనుప నవీన్ కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌లో భాగంగా ఈనెల 22న వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న యువ ఉత్సవ్ కార్యక్రమానికి కళాకారులు, రచయితలు, ఫొటోగ్రాఫర్లు, వక్తలు హాజరై తమ ప్రతిభను కనబర్చాలని కోరారు. విజేతలకు నగదు, బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ప్రవీణ్ సింగ్, ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు పూల నాగయ్య, కొండ నాయక్, బాలలక్ష్మి, వెంకటేశ్, అనూష, పద్మారావు, గోపి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

● అడిషనల్ కలెక్టర్ గంగాధర్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరికలెక్టరేట్, మార్చి 12 : వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అధికారులను ఆదేశించారు. జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన పంచాయతీ జిల్లా ప్లానింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి సమస్య నివారణ, పారిశుద్ధ్యం మెరుగునకు 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 60శాతం గ్రాంటును వినియోగించాలన్నారు. 40శాతం నిధులను విద్య, వైద్యం, సీసీరోడ్డు నిర్మాణాలకు ఉపయోగించాలన్నారు. జిల్లాకు కేటాయించిన నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలని సూచించారు. ఆవాస ప్రాంతాల్లో నీటి వనరులు లేకుంటే అద్దె బోర్లు తీసుకోవాలన్నారు. విద్యాలయాలు, వసతిగృహాల్లో నీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, డీఎంహెచ్ఓ మనోహర్, డీఆర్డీఓ నాగిరెడ్డి, డీఈఓ సత్యనారాయణ అధికారులు తదితరులున్నారు.

మహిళలు ఎదిగితే సమాజ అభివృద్ధి సాధ్యం : అదనపు కలెక్టర్

మహిళలు ఎదిగితే సమాజం అభివృద్ధి చెందుతుందని, మహిళలు అన్ని రంగాల్లో ముందుండి సాధికారతకు తోడ్పడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం స్త్రీ, శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన హాజరై మాట్లాడారు. విద్య, ఉపాధి భద్రత వంటి రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా అన్నింట్లో ముందుంటారని, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తీ , జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సఖి కేంద్ర నిర్వాహకురాలు ప్రమీల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, జిల్లా పౌర సంబంధాల అధికారి అరుంధతి, జిల్లా ట్రెజరీ అధికారి సంపూర్ణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితి, సీడీపీఓలు జ్యోత్స్న, శైలజ, స్వరాజ్యం, రమ, శశికళ, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి : ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 12 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తాగు నీటి సమస్యపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అసిస్టెంట్ ఇంజినీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలుంటే ప్రైవేట్ బోర్లను అద్దెకు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రమణి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఈఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై మంటలు.. తప్పిన ప్రమాదం

మంటలు ఆర్పతున్నన లైన్‌మెన్ రమేశ్

ఆలేరు టౌన్, మార్చి 12 : పట్టణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ స్తంభంపై బుధవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల వివరాలు.. పట్టణంలోని మంతిపురి రోడ్డులో కూల్ డ్రింక్స్ ఏజెన్సీ సమీపంలో గల ఇనుప విద్యుత్ స్తంభంపై మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వైర్లన్నీ దగ్ధమవుతుండగా స్థానికులు గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. లైన్‌మెన్ రమేశ్.. ఘటనా స్థలానికి వచ్చి పక్కనే ఉన్న బిల్డింగ్ ఎక్కి నీళ్లు పోస్తూ, కర్రతో కొడుతూ మంటలు ఆర్పాడు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా అవుతుండడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. స్తంభంపై విచ్చలవిడిగా ఇంటర్‌నెట్, టీవీ కేబుల్ వైర్లు ఉండడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

భువనగిరి కలెక్టరేట్ : వడపర్తి గ్రామంలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి : సీపీఎం

భువనగిరికలెక్టరేట్/బీబీనగర్/భూదాన్ పోచంపల్లి/రామన్నపేట, మార్చి 12 : సీపీఎం పోరుబాటలో భాగంగా ఆ పార్టీ నాయకులు బుధవారం జిల్లాలోని గ్రామాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భువనగిరి మండలం వడపర్తి గ్రామంలోని వాగు చెరువు నుంచి కాల్వ ద్వారా మదీన చెరువును నింపి రైతాంగానికి సాగునీరు, పశువులకు తాగునీరు అందించి, ఎండిన పంటలకు ఎకరాకు రూ.30వేలు నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. బీబీనగర్ మండలంలోని రాయరావుపేట గ్రామంలో సర్వే నంబర్ 178లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని మెహర్‌నగర్ నుంచి పోచంపల్లికి వచ్చే దారిలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రామన్నపేట మండలంలోని నీర్నెంముల గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు మాజీ సర్పంచ్ బోయిని ఆనంద్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్ డిమాండ్ చేశారు.

చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్‌కు సన్మానం

జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పోచంపల్లి చేనేత నాయకులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 12 : జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీగా పున్న శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మండల పద్మశాలీ చేనేత కార్మిక సంఘం, జిల్లా చేనేత జన సమాఖ్య ప్రతినిధులు బుధవారం చేనేత శాలువాతో శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పోచంపల్లి కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, ప్రతినిధులు బిట్ల గణేశ్, కటకం శ్యాంసుందర్, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింత కింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి అయిటిపాముల మహేందర్ పాల్గొన్నారు.

డీసీపీని కలిసిన యాదవ సంఘం నాయకులు

డీసీపీ అక్షాంశ్ యాదవ్‌ను సన్మానిస్తున్న పుట్ట వీరేశ్ తదితరులు

భువనగిరి అర్బన్, మార్చి 12 : శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా కమిటీ సభ్యులు డీసీపీ అక్షాంశ్ యాదవ్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు నక్కల చిరంజీవి, గుండెబోయిన సురేశ్, మర్రి పాండు, ర్యాకల రమేశ్, శ్రీరామ్ శరత్, కంచనపల్లి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

బొమ్మల రామారం మండలం మైలారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం బహుమతులు ఇచ్చారు.

మల్లాపురంలో లో ఓల్టేజీ పై విద్యుత్ అధికారుల పరిశీలన

యాదాద్రి భువనగిరి, మార్చి 12 (నమస్తే తెలంగాణ) : యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురంలో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఓ ఓల్టేజీ సమస్యను బుధవారం అధికారులు తనిఖీ చేశారు. నమస్తే తెలంగాణ పత్రికలో బుధవారం 'నీళ్లివ్వకుండా నట్టేట ముంచుతారా..?' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. వ్యవసాయానికి సరిపోయే నాణ్యమైన విద్యుత్‌ను కరెంటును అందిస్తామని, సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామని ఏఈ ఎంవీఎస్ నాయుడు తెలిపారు.

అన్నప్రసాదానికి రూ.5 లక్షలు విరాళం

యాదగిరిగుట్ట, మార్చి 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులను నిత్యాన్నదాన ప్రసాదానికి హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన కర్నాటి రమేశ్, శ్రీదేవి దంపతులు రూ.5 లక్షలు విరాళం సమర్పించారు. బుధవారం ఇందుకు సంబంధించిన చెక్కును ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు అందించారు.

రామన్నపేటలో రైళ్లు ఆపాలని పార్లమెంట్‌లో ప్రస్తావన

రామన్నపేట, మార్చి 12 : మండల కేంద్రంలో నిలిచే రైళ్లను కరోనా సమయంలో నిలిపి వేయగా తిరిగి పునరుద్ధరించాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ప్రస్తావించారు. నారాయణాద్రి, ఫలక్‌నుమా, డెమో, చెన్నై, శబరి, డెల్టా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రామన్నపేటలో ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో 50వేలకు పైగా జనాభా ఉండటంతో విద్య, వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే రైళ్లను పునరుద్ధరించాలని కోరారు.

23న పోచంపల్లి బ్యాంక్ సర్వసభ్య సమావేశం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 12 : ఈనెల 23న మధ్యాహ్నం 3 గంటలకు చేనేత డైహౌస్ భవనంలో పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈఓ సీత శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పాలకవర్గ ప్రతినిధులు, బ్యాంక్ ఖాతాదారులు, వాటాదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అంతటి జగన్

చౌటుప్పల్, మార్చి 12 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో అప్పుల బాధ తాళలేక వ్యక్తి పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంతటి జగన్(45) బోర్ వెల్స్ వ్యాపారం, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యాపారం సరిగా నడువక, వ్యవసాయంలో నష్టాలొచ్చి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ నెల 2న కుటుంబ సభ్యులకు పనినిమిత్తం బావి దగ్గరకు వెళ్తున్నానని చెప్పి పురుగుల మందు తాగాడు. కాసేపటి తరువాత కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మందు తాగానని చెప్పడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానాకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ చెప్పారు. మృతుడికి కూతరు, కుమారుడు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి : శ్రీహరి

ఆత్మకూరు(ఎం), మార్చి 12 : నాయీ బ్రాహ్మణ సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు బొల్లెపల్లి శ్రీహరి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అందించినట్లు హెయిర్ సెలూన్లకు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని కోరారు. బలరాం, దుర్గయ్య, నర్సింహ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురంలో మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

రేవంత్‌రెడ్డిది పాపిష్టి పాలన

● సర్పంచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య గౌడ్

రాజాపేట, భూదాన్‌పోచంపల్లిలో అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

సంస్థాన్ నారాయణపురం, మార్చి 12 : సీఎం రేవంత్‌ది ప్రజాపాలన కాదు.. పాపిష్టి పాలన అని సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు బుధవారం ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యాదయ్యగౌడ్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు రాక ఎంతో మంది మాజీ సర్పంచ్‌లు అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులు, నిర్బంధంతో వేదిస్తున్న సీఎం రేవంత్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల్లో సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు దోనూరి శేఖర్ రెడ్డి, పాండురంగా నాయక్, మన్నె చిత్రసేనారెడ్డి, కట్టెల భిక్షపతి ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

రాజాపేట : మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమ నిర్బంధాలతో పెండింగ్ బిల్లుల కోసం పోరాటాన్ని ఆపలేరన్నారు. బడ్జెట్ సమావేశాల్లో గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారిలో మాజీ సర్పంచ్‌లు నాగిర్తి గోపిరెడ్డి, పంబ కర్ణాకర్, దేవీనాయక్ తదితరులున్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలో పెద్దగూడెం మాజీ సర్పంచ్ మన్నె పద్మారెడ్డి, జగత్‌పల్లి మాజీ సర్పంచ్ నోముల ఎల్లారెడ్డిని అరెస్ట్ చేశారు.

వలిగొండ : మండలంలోని సంగెం, వర్కట్‌పల్లి, చిత్తాపురం గ్రామాల మాజీ సర్పంచ్‌లు కీసరి రాంరెడ్డి, మీసాల శేఖర్, ఏనుగు అంజిరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.

కొండమడుగు పశువుల సంతకు రూ.91లక్షలు

వేలం పాటలో పాల్గొన్న గ్రామస్తులు

బీబీనగర్, మార్చి 12 : మండలంలోని కొండమడుగు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 2025-26వ సంవత్సరానికి గానూ పశువుల సంత వేలాన్ని బుధవారం స్పెషల్ ఆఫీసర్ మాజిద్, పంచాయతీ కార్యదర్శి అలివేలు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన మీసాల రాములు, కడెం బీరప్ప చివరి వరకు పోటాపోటీగా వేలం పాటలో పాల్గొనగా బీరప్ప రూ.91.18లక్షలకు దక్కించుకున్నారు. సైకిల్ స్టాండ్ హక్కులను కూడా బీరప్ప రూ.5.91లక్షలకు దక్కించుకున్నారు. ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 31, 2026 వరకు వేలం కాలపరిమితి ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడెం లతారాజేశ్ బాబు, మాజీ వైస్ ఎంపీపీ వాకిటి గణేశ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ భాషబోయిన పెంటయ్య, రంగ గోపాల్, యర్కల శ్రీనివాస్‌గౌడ్, చింతల సుదర్శన్‌రెడ్డి, వాకిటి చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్, రవి, బాలరాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చౌటుప్పల్, మార్చి 12 : పట్టణంలోని అమ్మనాన్న అనాథాశ్రమంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బౌంటియస్ ఎకో లైట్ కంపెనీ ఆధ్వర్యంలో సర్వే జనా ఫౌండేషన్ వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 600మంది తల్లిదండ్రులు లేని పిల్లలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు బొబ్బ వెంకట నాగార్జున, బి.రామకృష్ణ, సీహెచ్ నరేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

జుక్షియో ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి : సీఐటీయూ

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

భువనగిరి అర్బన్, మార్చి 12 : జుక్షియో టెక్నాలజీ సంస్థలో తొలగించిన ఉద్యోగులను తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో సుమారు 900 మంది ఐటీ ఉద్యోగులతో కొనసాగుతున్న సంస్థ ఒకేసారి ముందస్తు నోటీస్ లేకుండా 750 మంది ఉద్యోగులకు పైగా తొలగించడం చట్ట విరుద్ధమన్నారు. తక్షణమే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా వారికి చట్టప్రకారం రావాల్సిన బెనిఫిట్స్‌ని అందజేయాలని లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో అందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కల్లూరి మల్లేశం, ఎండి.పాషా, సోములు, మాయ కృష్ణ, నందీశ్వర్, గణపతిరెడ్డి పాల్గొన్నారు.

ఐద్వా పోరాటాల ఫలితంగానే మహిళా చట్టాలు : మత్స్యారాణి


జెండా ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకురాలు

వలిగొండ, మార్చి 12 : ఐద్వా పోరాటాల ఫలితంగానే మహిళా చట్టాలు సాధ్యమయ్యాయని సంఘం మండల అధ్యక్షురాలు కర్నాటి మత్స్యారాణి అన్నారు. మండల కేంద్రంలో ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో శీలం ఇందిర, గర్దాసు నర్మద, దుబ్బ లత, వేముల లలిత, కూర మంగమ్మ, నాగలక్ష్మి, పద్మ, రజిత, నీరజ పాల్గొన్నారు.

బీబీనగర్ మండల వాసికి ఉమెన్ ఇన్‌స్పిరేషన్ అవార్డు


ఉమెన్ ఇన్‌స్పిరేషన్ అవార్డు అందుకుంటున్న నిర్మల

బీబీనగర్, మార్చి 12 : మండలంలోని మగ్దుంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న వేలుపల్లి నిర్మలకు ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉమెన్ ఇన్‌స్పిరేషన్ అవార్డు-2025 దక్కింది. గ్రీన్ ఇండియా సొసైటీ చైర్మన్ జ్యోతిరెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు గానూ వివిధ జిల్లాల్లో 10 వేల మొక్కలు నాటడంలో నిర్మల చేసిన కృషికి ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడాలని, మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.